వాయిస్ టుడే
జనగాత్రం - మీనచేత్రం
హైదరాబాద్
శుక్రవారం, 19 జనవరి, 2024

యాత్ర 2 నుంచి చూడు నాన వీడియో సాంగ్

టాలీవుడ్‌లో పొలిటికల్ జోనర్ ప్రాజెక్టుగా వచ్చి సూపర్ హిట్‌గా నిలిచింది యాత్ర. ఏపీ (పూర్వ ఆంధ్రప్రదేశ్) దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజకీయ ప్రయాణం నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విమర్శకుల ప్రశంసలు అందుకుంది. వైఎస్సార్ పాత్రలో మమ్ముట్టి నటించారు. దీనికి కొనసాగింపుగా ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి పొలిటికల్ జర్నీ నేపథ్యంలో సీక్వెల్ యాత్ర 2 కూడా వస్తోన్న విషయం తెలిసిందే. యాత్ర 2 నుంచి ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. మరోవైపు ఇటీవలే లాంఛ్ చేసిన టీజర్ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. తండ్రీకొడుకులు మిలియన్ల సంఖ్యలో జనాల మనసులో ఎలాంటి చెరగని ముద్రవేసుకున్నారో తెలిపే ప్రయాణం నేపథ్యంలో సాగే చూడు నాన వీడియో సాంగ్‌ను రేపు ఉదయం 11 గంటలకు లాంఛ్ చేయనున్నట్టు ప్రకటించారు. ఓదార్పు యాత్రలో ఉన్న తాజా లుక్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది.

జీవితంలో నేను చేసిన అతి పెద్ద తప్పు అదే..

నటి సమంత సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటారు. తాజాగా ఆమె అభిమానుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా తన వైవాహిక జీవితం గురించి పరోక్షంగా కామెంట్స్ చేశారు. జీవితంలో చేసిన అతి పెద్ద తప్పేంటో చెప్పారు. 'నా ఇష్టాయిష్టాలను గుర్తించడంలో విఫలమయ్యాను. దానిని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. ఎందుకంటే గతంలో నా భాగస్వామి వాటిని ప్రభావితం చేశాడు. క్లిష్ట సమయం నుంచే మనం విలువైన పాఠం నేర్చుకోగలమని అర్థమైంది. ఈ విషయాన్ని గ్రహించిన తర్వాతే నా వ్యక్తిగత ఎదుగుదల మొదలైంది' అన్నారు. ఇక గతంలోనూ సమంత ఒక ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ తన విడాకులు, వరుస ఫ్లాప్‌లు, ఆరోగ్య సమస్యలు ఒకేసారి చుట్టుముట్టడంతో ఎంతో కుంగిపోయినట్లు తెలిపారు. ఒకవైపు ఆరోగ్యం దెబ్బతింటుంటే.. మరోవైపు వైవాహిక బంధం ముగిసిందని పేర్కొన్నారు. దీంతో కుంగుబాటుకు గురైనట్లు చెప్పారు.

సమంత

ఇరవై రెండేళ్ల తర్వాత..



ఇరవై రెండేళ్ల తర్వాత బాలీవుడ్ అగ్ర హీరో షారుక్ ఖాన్, కళాత్మక చిత్రాల దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ కాంబినేషన్‌లో ఓ చిత్రం పట్టాలెక్కనుంది. అదే భన్సాలీ తన కలల ప్రాజెక్టుగా చెబుతున్న 'ఇన్షా అల్లా'. ఈ రొమాంటిక్ కామెడీలో సల్మాన్‌ఖాన్ నటిస్తున్నారని గతంలో వార్తలు వచ్చినా.. ఇప్పుడు ఆయన స్థానంలో షారుక్ పచ్చజెండా ఊపినట్టు సమాచారం. 'కొద్దినెలలుగా షారుక్, భన్సాలీ మధ్య చర్చలు జరుగుతున్నాయి. కథాపరంగా షారుక్ అయితేనే ఈ పాత్రకు సరిపోతారని భన్సాలీ నచ్చజెప్పడంతో షారుక్ ఈ సినిమా చేయడానికి అంగీకరించారు. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది' అంటూ గురువారం ఓ మీడియా సంస్థ తమ కథనంలో పేర్కొంది. వయసు మళ్లిన హీరో, అతడి కన్నా వయసులో బాగా చిన్నదైన కథానాయిక మధ్య మొదలైన ప్రేమ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కనుంది.

వి.ఐ.ఆనంద్ సినిమా పేరు భైరవకోన

హీరో సందీప్ కిషన్ – విఐ ఆనంద్ ల ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'ఊరు పేరు భైరవకోన'. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మిస్తుండగా, ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా ఈ చిత్రానికి సహ నిర్మాత. కావ్యా థాపర్, వర్ష బొల్లమ్మ హీరోయిన్లు. ఫిబ్రవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ట్రైలర్ లాంచ్ చేసింది.

దర్శకుడు విఐ ఆనంద్ మాట్లాడుతూ.. ఊరు పేరు భైరవకోన నా కెరీర్ లో ఛాలెంజింగ్ ప్రాజెక్ట్. ప్రతి సినిమాతో ప్రేక్షకులు డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వాలని కోరుకుంటాను. ప్రేక్షకులు వారి జీవితంలో రెండున్న గంటలు సమయాన్ని కేటాయించి ఒక సినిమా చూస్తారు. వారి సమయానికి విలువ ఇవ్వాలని కోరుకుంటాను. దానికి తగిన కష్టం పడాలి. కథ'), స్క్రీన్ ప్లే కొత్త కంటెంట్ ప్రయత్నించాలి" అన్నారు!!

రెండేళ్లకు 'గోల్‌మాల్ 5'

ఫన్ అన్‌లిమిటెడ్ అనే ఉపశీర్షికతో ప్రేక్షకులకు అపరిమితమైన వినోదం పంచాయి 'గోల్‌మాల్' ఫ్రాంచైజీ చిత్రాలు. తాజాగా ఈ వరుసలో 'గోల్‌మాల్ 5' కూడా ఉంటుందని ప్రకటించారు దర్శకుడు రోహిత్ శెట్టి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "గోల్‌మాల్ 5' తప్పకుండా ఉంటుంది. వచ్చే రెండేళ్లలో ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది. ముందు వాటికంటే మరింత హాస్యభరితంగా ఉండేలా కథ సిద్ధం చేస్తున్నాం. 'గోల్‌మాల్' సిరీస్‌క్కి చాలామంది అభిమానులున్నారు. వాళ్లకు నచ్చేలా సినిమా మలుస్తాం' అన్నారు. నిర్మాత భూషణ్ కుమార్‌తో కలిసి శెట్టి ఈ ఫ్రాంచైజీ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో ముస్తాబైన 'ఇండియన్ పోలీస్ ఫోర్స్' విడుదలకు సిద్ధంగా ఉంది.

అదృష్టశాలి ముగింపు



గతేడాది 'ది రైల్వే మెన్' సిరీస్‌లో తన నటనకు ఎన్నో ప్రశంసలు అందుకున్నారు ప్రముఖ కథానాయకుడు ఆర్ మాధవన్. ప్రస్తుతం ఆయన తమిళంలో నటిస్తున్న చిత్రం 'అదృష్టశాలి'. మిత్రన్ జవహర్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం తాజాగా షూటింగ్‌ను పూర్తి చేసుకున్నట్లు మాధవన్ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించారు. 'ఎన్నో సవాళ్లు, ఎంతో సరదాగా గడిచిన ఈ సినిమా షూటింగ్ ముగిసింది. దీన్ని మీ ముందుకు తీసుకొచ్చేందుకు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నాం' అంటూ వ్యాఖ్యల్ని జోడించారు. ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌లో రాధికా శరత్‌కుమార్, షర్మిలా మాండ్రే, సాయి ధన్షిక, మడోనా సెబాస్టియన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

నిజాల్ని నిగ్గదీసే పాత్రికేయురాలిగా..



'అభంశుభం తెలియని బాలికల హక్కుల కోసం నేను పోరాడుతున్నా. ఈ విషయం మీకు అర్థమవుతోందా?' అంటోంది బాలీవుడ్ కథానాయిక భూమి పెడ్నేకర్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న 'భక్షక్' చిత్రంలోని డైలాగ్ ఇది. పుల్కిత్ దర్శకత్వంలో రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై తెరకెక్కనుందీ చిత్రం. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందించిన ఈ సినిమా టీజర్‌ను తాజాగా సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. 'నిజాల్ని వెలికితీసే క్రమంలో ఎన్నో దారుణాలను బయటపెట్టే ఒక పరిశోధక జర్నలిస్ట్ కథే 'భక్షక్'. ఫిబ్రవరి 9న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది' అనే వ్యాఖ్యల్ని జోడించింది. 'మునవ్వర్‌పూర్‌లో బాలికలు లైగింక వేధింపులకు గురవుతున్నట్లు ఒక నివేదికలో బయట పడింది. ఆ విషయాన్ని బన్సీ సాహూ అనే వ్యక్తి దాచడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నాడు?' అనే సంభాషణ సినిమాపై మరింత ఆసక్తి రేకెత్తించేలా ఉంది. సంజయ్ మిశ్రా, ఆదిత్య శ్రీవాత్సవ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం ఫిబ్రవరి 9న నెట్‌ఫ్లిక్స్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

నాగ్.. ధనుష్‌ల చిత్రం ప్రారంభం

ధనుష్, నాగార్జున కథానాయకులుగా.. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. రష్మిక కథానాయిక. అమిగోస్ క్రియేషన్స్ సంస్థతో కలిసి శ్రీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మిస్తున్నారు. సోనాలి నారంగ్ సమర్పకులు. గురువారం ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. ధనుష్‌పై కీలకమైన సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. "ధనుష్, నాగార్జున.. ఈ ఇద్దరి స్టార్‌లను తెరపై చూడటానికి అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. 'ఫిదా', 'లవ్‌స్టోరి' చిత్రాల తర్వాత శేఖర్ కమ్ముల ఓ విభిన్నమైన కథతో దీన్ని తెరకెక్కిస్తున్నార"ని సినీవర్గాలు తెలిపాయి.



ఫైటర్ కౌంట్‌డౌన్

కొద్దిరోజుల్లో 'ఫైటర్'గా తెరపై పోరాటాలు చేయడానికి ముస్తాబవుతున్నాడు బాలీవుడ్ కథానాయకుడు హృతిక్ రోషన్. ఆయన, దీపికా పదుకొణె జంటగా నటించిన చిత్రమిది. సిద్ధార్థ్ ఆనంద్ తెరకెక్కించారు. భారతీయ వైమానిక దళం నేపథ్యంలో సాగే మొదటి ఏరియల్ యాక్షన్ చిత్రంగా దీన్ని రూపొందించారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ట్రైలర్, పోస్టర్లకి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తాజాగా 'కౌంట్‌డౌన్ మొదలు..' అంటూ.. ఓ కొత్త పోస్టర్‌ను ఎక్స్ వేదికగా పంచుకున్నాడు హృతిక్. ఇందులో యుద్ధ విమానం పైలట్‌గా కనిపించనున్నాడాయన. అనిల్ కపూర్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రం ఈ నెల 25న రానుంది.

మరియా పాత్ర నాకెంతో నేర్పింది



'టైగర్ 3'లోని జోయా పాత్ర తర్వాత నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవడానికి అవకాశం కల్పించింది మరియా పాత్రనే' అంటోంది బాలీవుడ్ అగ్ర కథానాయిక కత్రినా కైఫ్. ఆమె, విజయ్ సేతుపతితో కలిసి మరియాగా నటించిన చిత్రమే 'మెరీ క్రిస్మస్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా సానుకూల స్పందన సొంతం చేసుకుంటోంది. ఈ సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కత్రిన... 'ఇందులో మరియాది ఒక భిన్నమైన ప్రపంచం. నటనకు ఎంతో అవకాశముంది. చిత్రీకరణ ప్రారంభమయ్యే ముందే ఈ సినిమా, పాత్ర గురించి దర్శకుడు శ్రీరామ్‌తో దాదాపు ఏడాదిన్నరపాటు చర్చలు జరిపాను. కథ చెప్పడం పూర్తవగానే 'మరియా ఎవరు? తన వెనకున్న కథేంటి? ఆమె జీవితంలో ఏం జరిగింది?' అని భిన్న కోణాల్లో ఆలోచించమని చెప్పారు. అలా చేయడం నాకెంతో మేలు చేసింది. నేను సమర్థంగా నటించి, నన్ను నేను కొత్తగా నిరూపించుకోవడానికి దోహదపడింది' అంటూ చెప్పుకొచ్చింది కత్రిన.